# పిల్లల ముందు జాగర్తగా మాట్లాడండి!

ఆ మాటే అంది భర్తతో సునంద! "వాళ్ల మొహం, వాళ్లుంటే ఏమైందిలే!" అన్నాడు మూర్తి.

ఈలోగా ఏదో పన్లో పడిపోయింది సునంద.

అంతలో మళ్ళీ ఏదో జ్ఞాపకం వచ్చినవాడిలా "ఇందులో డబ్బులేమయ్యాయి. నువ్వే తీసుంటావ్? వెధవ దొంగబుద్ధీ నువ్వూను" అంటూ అరిచాడు భార్య మీద.

"నేను తియ్యలేదండీ! నాకు తెలీనే తెలీదు" అంది సునంద.

"పైగా అబద్ధాలు కూడా! మీ వంశమే దొంగవంశం, అబద్ధాల వంశమూనూ" అంటూ తల్లిదండ్రుల దగ్గర్నుంచీ, అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ల దగ్గరనుంచీ తాత ముత్తాతల వరకూ కడిగిపారేశాడు. సునంద కళ్ళ నీళ్ళు పెట్టుకుంటూ వుంటే పిల్లలిద్దరూ రవీ, ఉమా బిక్కుబిక్కుమని చూస్తూ కూర్చున్నారు. అరిచే తండ్రి వంకా, ఏడ్చే తల్లివంకా చూస్తూ!

అంతట్లో మూర్తి అక్క శకుంతల వచ్చింది అక్కడికి! సునందా, శకుంతలా ఏదో మాటల్లో పడ్డారు. "భోంచేసి వెళ్లండి" బలవంతం చేసింది సునంద.

సరేనని భోంచేసి వెళ్లారు వాళ్లు!

"అబ్బ! ఏంటా తిండి శకుంతలా? ఇంత అన్నం అలా కలుపుకుని ఛీ ఛీ హిడింబిలా వుంది.

ఆ పిల్లలు చూడు! నరేష్ కుడి పాపిడీ వాడూ చెత్తగా ఉన్నాడు. శిరీష మాత్రం? అది వేసుకున్న పింకు గౌను ఎంత అసహ్యంగా వుంది కదూ?" అన్నాడు మూర్తి.

మూర్తికి ఎవరిని చూసినా ఏదో పేర్లుపెట్టడం అలవాటు. ఆ విషయంలో అతనికి స్వపర భేదంలేదు. మూర్తి తమ్ముడు లైట్ కాఫీ సీడ్ రంగు బుష్‌కోట్ వేసుకొచ్చాడు. "ఎలా వుందన్నయ్యా?" అని అడిగే లోపలే ఇంకొంచెం డార్కుగా వుంటే టాక్సీ డ్రైవర్ లా ఉండేది. ఆ ప్యాంటేమిటీ? మ్యాచింగా?" వెటకారంగా మాట్లాడాడు. అతడు చిన్నబుచ్చుకుని వెళ్లిపోయాడు. పిల్లలిద్దరూ వాళ్ల బాబాయ్ ఆ బట్టలు వేసుకున్నప్పుడల్లా 'టాక్సీ డ్రైవర్' అని ఏడిపించేవాళ్లు.

సునంద చెల్లెలు సరితకి ఎప్పుడూ అడిగిన వాళ్లకీ అడగని వాళ్లకీ ఏదో ఒక సలహా చెప్పడం అలవాటు.

ఆవిడొస్తోందీ అంటే పిల్లలు 'అమ్మా! సుత్తి మనిషొస్తోంది' అనేవారు.

ఇలా పిల్లల్లో నాటుకుపోయిన భావాలు వాళ్లతో పాటే పెరిగి పెద్దయ్యాయి. వయస్సుతో పాటు పెరిగే సౌమ్యతవల్లా, తగ్గే ఉద్రేకం వల్లా క్రమేణా మూర్తీ సునందలు ఈ మాటలనడం, పేర్లు పెట్టడం మానేసినా, పిల్లలు మాత్రం వాళ్ల మనసుల్లో నాటుకుపోయిన ఆనాటి మాటలను త్రోసిపుచ్చలేకపోయారు.

తల్లీ తండ్రీ వాడు ఎవరిని గురించి వెటకారంగా మాట్లాడుకునేవారో వారిని ఈనాడు వాళ్ల తండ్రీ అలా మాట్లాడ్డం మానేసినా పిల్లలు మాత్రం అలాగే మాట్లాడుతున్నారు. ఇప్పటికీ శకుంతలని "హిడింబీ" అనీ మరొకరిని "సుత్తీ" అనీ అలాగే పిలుస్తున్నారు.

ఆ సంగతి తెలిసిన శకుంతలమ్మా, సరితా, వాళ్ల బాబాయ్ ఇలా ఒక్కొక్కరే వాళ్లింటికి రావడం మానేశారు.

మూర్తీ సునందా వాళ్లెందుకు రావడం మానేశారో తెలీక బాధపడుతున్నారు.

ఇదంతా విన్న మూర్తి ఫ్రెండ్ మనోహర్ చెప్పాడు "ఒరేయ్! నువ్వు మీ

ఆవిడ వాళ్ల కళ్లముందే మాట్లాడుకున్నా విషయాలు చిన్నప్పుడే మీ రవీ, ఉమల మనసుల్లో నాటుకుపోయాయి! అవి చెరపడానికి ఇప్పుడు నీ శక్తి చాలదు. పెద్దయ్యాక, వాళ్ల బుద్ధి వికసించే దశొచ్చాక, వాళ్ల విచక్షణా జ్ఞానంతో వాళ్లే తెలుసుకోవాలి! అంతకన్నా ఏం లాభం లేదు! అందుకే పిల్లల ముందు జాగ్రత్తగా ప్రవర్తించాలి!

మీ అక్క వచ్చినప్పుడల్లా నన్ను జాగ్రత్తగా ఉండు, ఇలా ఉండు, అలా ఉండు అని ఏవేవో నీతులు చెప్పేది పాపం! ఒక్కోసారి అథారిటేటివ్‌గా ఆర్డరిచ్చినట్టు చెప్పేది. అది మా ఆవిడకి నచ్చేది కాదు. మా ఆవిడ బాధపడుతోందని తెలిసి అక్కయ్యని కేకలేశారు. ఆమె ఏడుస్తూ పోయింది. ఆ తరువాత మా ఆవిడేడ్చింది! అదంతా చూసిన మా పిల్లలకి మా అక్కంటే ద్వేషం పట్టుకుంది. ఇప్పుడు మా అక్కా, మా ఆవిడా బాగానే మాట్లాడుకున్నా మా పిల్లలు మా అక్కతో మాట్లాడరు. వాళ్లమ్మనీ, నన్నూ ఏదో అనేసింది మా అక్క అని వాళ్లకోసం!

"ఒరేయ్! పసితనంలో వాళ్లు కళ్లతో చూసిందీ చెవులతో విన్నదీ నమ్ముతారు కదా! వాళ్లకి దాని గురించి తర్కించే శక్తి ఆలోచనా ఉండదు కదా? అందుకని మనమే వాళ్లముందు జాగ్రత్తగా ప్రవర్తించాలి. పసి మనసులు కొత్త పలకల్లాంటివి! మన ప్రవర్తనా, మాటలు బట్టే ఆ పలకల మీద అక్షరాలు రాసుకుంటారు వాళ్లు!

"మనసు విరిగెనేని మరి అతుక నేర్చునా? పాలు విరగక మ్మునుందే జాగ్రత్తపడాలి! విరిగేక పారబొయ్యక తప్పదు" అన్నాడు మనోహర్! మూర్తి నిట్టూర్చాడు!

*